## పోలింగ్ కేంద్రాల పరిశీలన



గాజులపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న గరిమాఅగర్వాల్

రాయపోల్, నవంబర్ 28: దౌల్తాబాద్ మండలంలోని గాజులపల్లి గ్రామంలో పోలింగ్ కేంద్రాలను మంగళవారం దుబ్బాక నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరిమా అగర్వాల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో అధికారులు అందుబాటులో ఉండి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రాజేశ్‌కుమార్, అధికారులు ఉన్నారు.

## కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపు ఖాయం



మిరుదొడ్డి: కాసులాబాద్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మిరుదొడ్డి, నవంబర్ 28: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బొంపల్లి మనోహర్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ మంగళవారం మిరుదొడ్డి మండలంలోని కాసులాబాద్ గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించించారు. మిరుదొడ్డి టౌన్‌లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గొల్ల రాములు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, బీఆర్‌ఎస్ నాయకులు వెంటకయ్య, ఎల్లం, స్వామి, యాదాగౌడ్, భిక్షపతి, రామస్వామి, హలాం తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావాలని ముడుపు

వర్గల్, నవంబర్ 28: పద్మశాలీలు ఆర్థికంగా ఎదగడంలో అవిశ్రాంత కృషి చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ నుంచి మరోసారి లక్ష మెజార్టీతో గెలిచి హ్యాట్రిక్ సీఎం కావాలని కోరుతూ పద్మశాలీ సంఘం రాష్ట్ర కన్వీనర్ బూర మల్లేశం మంగళవారం వర్గల్ మండలం నాచగిరి క్షేత్రం నృసింహస్వామి సన్నిధిలో ముడుపు కట్టారు. చేనేత కార్మికులకు పింఛన్, ప్రమాద బీమా కల్పిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు.



నాచగిరి క్షేత్రంలో ముడుపు కడుతున్న బూర మల్లేశం

## సీఎం సభకు తరలిన గులాబీ శ్రేణులు

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 28: గజ్వేల్ పట్టణంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు కొండపాక ఉమ్మడి మండల వ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివెళ్లారు. సారే రావాలి.. కారే గెలువాలి.. అంటూ నినాదాలు చేశారు.



కొండపాక(కుకునూరుపల్లి): దుద్దెడ నుంచి గజ్వేల్‌లో నిర్వహించిన సీఎం ప్రజా ఆశీర్వాద సభకు తరలివెళ్తున్న ప్రజలు, నాయకులు

# దుబ్బాకలో ఎగిరేది గులాబీ జెండానే

- గెలిచిన నెల రోజుల్లోనే దుబ్బాక రెవెన్యూ డివిజన్
- దుబ్బాకలో కమలం వాడింది.. చెయ్యి కాలిపోయింది
- రాజకీయంగా ఎదుర్కోలేకనే హత్యాయత్నం
- బీఆర్‌ఎస్ దుబ్బాక అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాకలో బీఆర్‌ఎస్ ప్రచార ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి మంజులత

దుబ్బాక, నవంబర్ 28: దుబ్బాకలో కమలం పువ్వు వాడిపోయింది.. చెయ్యి కాలి పోయిందని, ఈ ఉద్యమ గడ్డపై ఎగిరేది గులాబీ జెండానేనని.. బీఆర్‌ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలో కొత్త ప్రభాకర్ రెడ్డి ఆయన సతీమణి మంజులతతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకర్గంలో బీఆర్‌ఎస్‌కు, కేసీఆర్ సర్కారుకు వచ్చిన ప్రజాదరణ చూస్తేంటే భారీ మెజార్టీ పక్కా అన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక తనపై హత్యాయత్నం చేశారని, వేంకటేశ్వరుడి దయ, దుబ్బాక ప్రజల ఆశీస్సులతో మళ్లీ బతికి మీ వద్దకు వచ్చానని చెప్పారు. సీఎం కేసీఆర్ రెండుసార్లు ఎంపీగా అవకాశం ఇచ్చారని, ఇప్పుడు దుబ్బాకకు సేవ చేసే భాగ్యం వచ్చిందన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాలు మాయమాటలతో మభ్యపెట్టేందుకు వచ్చాయని, వారి మాటలను నమ్మొద్దన్నారు. గత ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా గెలిచిన రఘునందన్‌రావు ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా నెరవేర్చడా అని ప్రశ్నించారు. రఘునందన్‌రావుతో దుబ్బాక మూడేండ్లు వెనుకబడిందన్నారు. అసైన్డ్ భూములకు బీఆర్‌ఎస్, కేసీఆర్ సర్కారు పూర్తి భద్రత కల్పిస్తుందని తెలిపారు.

### మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించండి..

ఈ ఎన్నికల్లో తనను మీ ఇంటి బిడ్డగా భావించి భారీ మెజార్టీతో గెలిపించాలని, ఎమ్మెల్యేగా గెలిచిన నెల రోజుల్లోనే దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తానని ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. దుబ్బాక రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాడితే ఎన్నో ప్రయోజనాలుంటాయని తెలిపారు. నియోజకవర్గంలో దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల ప్రజలు సిద్దిపేట డివిజన్‌లో, దౌల్తాబాద్, రాయపోల్ మండలాల వారు గజ్వేల్ డివిజన్‌లో, చేగుంట, నార్సింగ్ మండలాల వారు మెదక్ జిల్లాకు వెళ్లటంతో సమస్యగా మారిందన్నారు. దుబ్బాక రెవెన్యూ డివిజన్‌తో నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. దుబ్బాక మున్సిపాలిటీలో అండర్ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్డు, దుబ్బాక-హబ్షీపూర్ రోడ్డు విస్తరణ, మహిళా సంఘాలకు, బీడీ కార్మికులకు కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తామన్నారు. దుబ్బాకపై సీఎం కేసీఆర్‌కు ఎంతో ప్రేమ ఉందని, కానీ ఢిల్లీలో ఉండే ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీలకు ఉంటుందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రొట్టె రాజమౌళి, సోలిపేట సతీశ్‌రెడ్డి, పృథ్వీకృష్ణారెడ్డి, కత్తి కార్తీక, ఎల్లారెడ్డి, వంశీగౌడ్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రచారానికి భారీగా తరలివచ్చిన ప్రజలు

# రైతులు భూములు అమ్ముకోవద్దు

- కండ్ల ముందే మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులు
- ప్రతిపక్షాలను నమ్మి మోసపోవద్దు
- లావని, పరంపోగు భూములకు పట్టాలిస్తాం
- కొత్త ప్రభాకర్డ్డిని భారీ మెజార్టీతో గెలపించాలి
- మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్



చిన్నమాసాన్‌పల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఫార్ఖ్‌హుస్సేన్, తదితరులు

రాయపోల్, నవంబర్ 28: రైతులు ఎవరూ భూములు అమ్ముకోవద్దు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల నుంచి కాల్వాల ద్వార సాగు నీరు వస్తుంది. దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి.. అని మాజీ ఎమెల్సీ ఫరూఖ్‌హుస్సేన్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంం నిర్వహించారు. చిన్నమాసాన్‌పల్లిలో విలేకరుతో మాట్లాడారు. ఓట్ల కోసం ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారలు చేస్తున్నారని, లావ ని, పరంపోగు భూములు పోతాయని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నన్నారని ఆరోపించారు. రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో బీడు భుములు సస్యశ్యామలం అయ్యాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రికార్డు స్థాయిలో వరి ధాన్యం పండుతుందన్నారు. మచ్చలేని నాయకుడు కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. దుబ్బాక ఉప ఎన్నికలో ఎన్నో హామీలిచ్చి గెలిచిన తర్వాత ప్రజల మధ్య లేకపోవడం సిగ్గు చేటన్నారు. దౌల్తాబాద్, రాయపోల్ మండలాలకు చెంది న ప్రజలు కొత్త ప్రభాకర్‌రెడ్డి వైపు ఉన్నారని, వారిపై తనకు పూర్తి విశ్వాసం ఉన్నదన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ యాదగిరి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మామిడి మోహన్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రేకుల నర్సింహారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ పర్వేజ్, కలీలొద్దీన్, మండల ఇన్‌చార్జి కృష్ణారెడ్డి, మంజూర్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే చీకటి రాజ్యమే..

- దుబ్బాకలో కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- బీఆర్‌ఎస్ మహిళ నాయకురాలు కత్తి కర్తికగౌడ్



దౌల్తాబాద్‌లో చికెన్ కొడుతూ ఓట్లు అభ్యర్థిస్తున్న కత్తి కర్తికగౌడ్, తదితరులు

రాయపోల్, నవంబర్ 28: కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు వేస్తే అభివృద్ధి జరగదని, సీఎం కేసీఆర్ పాలనను ప్రజలు కోరుకుంటున్నారని, ఎన్నికల్లో దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని బీఆర్‌ఎస్ దుబ్బాక మహిళా నాయకురాలు కత్తి కర్తికగౌడ్ అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకరెడ్డికి మద్దతుగా స్థానిక నాయకులుతో కలిసి కారుగుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖయమన్నారు. ఇంటింటికీ మంచి నీరు అందించడంతోపాటు రైతులకు సాగు నీరు అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ తెలంగాణలో వ్యవసాయానికి ముడు గంటల కరెంట్ సరిపోతుందని చెబుతున్నదని, కాంగ్రెస్ వస్తే తెలంగాణలో మళ్లీ చీకటి రాజ్యం వస్తుందన్నారు. కొట్లాడి సాధించిన తెలంగాణలో రైతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని చెప్పారు. బీఆర్‌ఎస్ అంటే భారత రాష్ట్ర సమితి మాత్రమే కాదని, భారతీయ రైతుల సమితి అన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, సర్పంచ్ యాదగిరి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉమ్మడి నర్సింహారెడ్డి, మండల యూత్ నాయకులు కలీలొద్దీన్, నరేశ్, నాగరాజు పాల్గొన్నారు.